# మంచిప్ప ముంపు బాధితులకు అండగా ఉంటా..



నర్సింగ్‌పల్లిలో బాజిరెడ్డి గోవర్ధన్‌కు మంగళ హారతులతో స్వాగతం పలికి తిలకం దిద్దుతున్న మహిళలు

- గ్రామస్తులకు వెయ్యి ఇండ్లు కట్టిస్తా..
- బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు

మోపాల్ (ఖలీల్‌వాడి)/ డిచ్‌పల్లి, నవంబర్ 21 : మంచిప్ప రిజర్వాయర్ ముంపు బాధితులకు అండగా ఉంటానని, నష్టపరిహారం అందించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటానని, గ్రామస్తులకు వెయ్యి ఇండ్లు కట్టిస్తానని బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మోపాల్ మండలంలోని వడ్డెర కాలనీ, మంచిప్ప, కసాబ్‌బాగ్ తండా, కాల్పోల్, అమ్రాబాద్, నర్సింగ్‌పల్లి తదితర ప్రాంతాలతోపాటు డిచ్‌పల్లి మండలంలోని ముల్లంగి, ఘన్‌పూర్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు బాజిరెడ్డి గోవర్ధన్‌కు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయడంతో రాష్ట్రం వ్యవసాయంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. మహిళలు, పేదల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకులాలను ఏర్పాటు చేయడంతోపాటు పౌష్టికాహారం అందజేస్తూ ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ. 1.25 లక్షలు ఖర్చుచేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. కర్ణాటకలో సాగునీరు లేక పొలాలు ఎండిపోతున్నాయని, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అదేవిధంగా పాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని సూచించారు. 40 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వానికి నయా పైసా ఇవ్వలేదని.. అలాంటి పార్టీలను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 3 వేలు అందిస్తామన్నారు. డిసెంబర్ 5 తర్వాత బీడీ కార్మికులందరికీ పింఛన్లు రానున్నాయని చెప్పారు. తనను మరోసారి ఆశీర్వదించాలని, రూరల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. వృద్ధులు ప్రచారంలో పాల్గొనగా వారిని పలకరిస్తూ బాగోగులు తెలుసుకున్నారు. మోపాల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఎంపీపీ లతా కన్నీరాం, జడ్పీటీసీ కమలానరేశ్, మంచిప్ప సర్పంచ్ సిద్ధార్థ, ముత్యంరెడ్డి, నిమ్మల మోహన్‌రెడ్డి, రాధాకిషన్, సాయిరెడ్డి, రాములు, సగ్యానాయక్, రింగుల భూమయ్య, కంజర భూమయ్య పాల్గొన్నారు. ముల్లంగి, ఘన్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, శక్కరికొండ కృష్ణ, దాసరి లక్ష్మీనర్సయ్య, ఎంపీటీసీ సభ్యురాలు సవితా రామకృష్ణ, రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్ నారాయణరెడ్డి, సర్పంచ్ లావణ్యా మధు, పద్మారావు, అమీర్, నల్లవెల్లి సాయిలు, ఒడ్డెం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మంచిప్పలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

# బాజిరెడ్డికి మద్దతుగా ముమ్మర ప్రచారం



నల్లవెల్లిలో ప్రచారం చేస్తున్న ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నాయకులు



జక్రాన్‌పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాజిరెడ్డి సతీమణి వినోద, నాయకులు

ధర్పల్లి/ జక్రాన్‌పల్లి/ నిజామాబాద్ రూరల్/ సిరికొండ/ ఇందల్వాయి/ డిచ్‌పల్లి/ నవంబర్ 21 : బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో మంగళవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి, ధర్పల్లి సర్పంచ్ ఆర్మూర్ పెద్దబాల్‌రాజ్, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సతీమణి బాజిరెడ్డి వినోద కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటు వేయాలని ఇంటింటికీ తిరుగుతూ అభ్యర్థించారు. కార్యక్రమంలో విపంచీ జగన్, దీపికా అజయ్, శారద, ఎంపీపీ కుంచాల విమలారాజు, జడ్పీటీసీ తనూజా శ్రీనివాస్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, సర్పంచులు జక్కం చంద్రకళ, బాలకిషన్, రొడ్డ గంగాధర్, ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో రూరల్ బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ రూపొందించిన మ్యానిఫెస్టో అంశాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటా తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుకర్‌రావు, ఎంపీపీ అనూషా ప్రేమ్‌దాస్, జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్‌లో బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాదాస్, ఎంపీటీసీ చిన్నగంగు, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్, రాంపూర్‌లో బీఆర్ఎస్ మండల నాయకులు జోరుగా ప్రచారం చేశారు. బీఆర్ఎస్‌ను ఆశీర్వదించి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఇందల్వాయి మండలంలోని గన్నారం, ఎల్లారెడ్డిపల్లి, మల్లాపూర్, నల్లవెల్లిలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ రమేశ్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దాసు, సర్పంచ్ నోముల విజయలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ ఏదో పథకం ద్వారా లబ్ధి చేకూరుతున్నదన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కారుగుర్తుకే ఓటు వేసి బాజిరెడ్డిని నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బీరేశ్, ఎస్సీసెల్ రూరల్ కన్వీనర్ పాశంకుమార్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు లోలం సత్యనారాయణ, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ మోహన్‌నాయక్, బీఆర్ఎస్ మండల జనరల్ సెక్రటరీ పులి శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సాంబారి విఠల్, చంద్రాయన్‌పల్లి సర్పంచ్ లలితాదాస్, సీనియర్ నాయకులు శ్యాంసుందర్‌గౌడ్, యూత్ జనరల్ సెక్రటరీ భూసాని మహేశ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు తీగెల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బాజిరెడ్డికి మద్దతు తెలుపుతూ మంచిప్పలో ఏకగ్రీవ తీర్మానాలు

మోపాల్ (ఖలీల్‌వాడి), నవంబర్ 21 : మోపాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన వివిధ కుల సంఘాల సభ్యులు తమ మద్దతు బాజిరెడ్డికే ఉంటుందని తెలిపారు. మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేసి, తీర్మాన ప్రతులను బాజిరెడ్డి గోవర్ధన్‌కు అందజేశారు. వడ్డెర సంఘ సభ్యులు 60 కుటుంబాలు, రజక సంఘం 20 కుటుంబాలు, మున్నూరుకాపు సంఘం 50 కుటుంబాలు, మాదిగ సంఘం 50 కుటుంబాలు, మాల సంఘం 30 కుటుంబాలు, ముదిరాజ్ సంఘ సభ్యులు 70 కుటుంబాలు, జామా మసీదు మైనార్టీ సంఘ సభ్యులు 80 మంది ఏకగ్రీవ తీర్మానం చేసి, తీర్మాన ప్రతులను బాజిరెడ్డికి అందజేశారు.

## పాంగ్రా బ్యాంకు కాలనీ వాసులు..



బాజిరెడ్డికి మద్దతు తెలుపుతున్న కెనాల్ కట్ట వాసులు

నిజామాబాద్ రూరల్, నవంబర్ 21 : బీఆర్ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కే మా మద్దతు ఉంటుందని పాంగ్రా బ్యాంకు కాలనీలోని కెనాల్‌కట్ట వాసులు స్పష్టంచేశారు. కాలనీవాసులందరూ నగరంలోని బాజిరెడ్డి నివాసానికి మంగళవారం తరలివెళ్లి మద్దతు తెలిపారు. గుడిసెలో నివాసముంటున్న తమకు పక్కా ఇండ్లు మంజూరు చేసి, పట్టాలను అందజేయాలని బాజిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ చౌదరి, నర్సింహాచారి, వినోద్‌కుమార్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో బాజిరెడ్డి పర్యటన

నిజామాబాద్ రూరల్, నవంబర్ 21 : బీఆర్ఎస్ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నిజామాబాద్ మండలంలోని 13 గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండారంలో ఉదయం 9 గంటలకు, మల్కాపూర్(ఏ)లో 10.30 గంటలకు, జలాల్‌పూర్‌లో 11.30, పాల్దాలో 12.30, తిర్మన్‌పల్లిలో 1.15, కొండూర్‌లో 1.45, శాంతినగర్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు, శ్రీనగర్‌లో 3.30, కాలూర్‌లో సాయంత్రం 4, ఖానాపూర్‌లో 6 గంటలకు, శాస్త్రీనగర్, రాంనగర్‌లో రాత్రి 7 గంటలకు, సారంగాపూర్‌లో రాత్రి 8 గంటలకు బాజిరెడ్డి ప్రచారం నిర్వహిస్తారని వివరించారు. బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..




బాజిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బైకడి రాజారెడ్డి

సిరికొండ, నవంబర్ 21 : మండలంలోని కొండూర్ గ్రామానికి చెందిన బైకడి రాజారెడ్డి కాంగ్రెస్‌ను వీడి మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్మాల సుదర్శన్‌రెడ్డి, రోండ్ల నరేందర్‌రెడ్డి, చెల్లం లింబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు నోటిఫికేషన్

డిచ్‌పల్లి, నవంబర్ 21 : టీయూ అనుబంధ కళాశాలల పరిధిలో డిగ్రీ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు 1, 3, 5వ రెగ్యులర్ సెమిస్టర్‌తోపాటు 2, 4, 6వ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 6వ తేదీలోగా ఫీజు చెల్లించాలని సూచించారు. రూ. 100 అపరాధ రుసుముతో వచ్చే నెల 7వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని లేదా టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.